


## ఆదివాసీల అభ్యున్నతికి చిత్తశుద్ధితో కృషి చేయాలి

- వారు అన్ని రంగాల్లో రాణించాలి
- ఆర్థిక అభివృద్ధి సాధించాలి
- విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి
- రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

8 లో..


# వరంగల్ వాయిస్
Evening Daily
www.warangalvoice.net
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 359 మంగళవారం | 25 ఆగస్టు 2024 | పేజీలు : 08 | వెల రూ. 5


## ఆఫీసర్స్ క్లబ్‌లో అక్రమాలు

- కలెక్టర్ చైర్మన్‌గా ఉన్నా రూ.4కోట్లు గోవిందా..
- 154మంది సభ్యుల సొమ్ము స్వాహా
- ధ్రువ పత్రాలు సైతం లేని వైనం
- వెయిటర్ ఆత్మహత్య వీడియోతో వెలుగు చూస్తున్న నిజాలు




# కరప్షన్ క్లబ్

క్లబ్ కహానీ.. 1



అది ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే గుర్తింపు కలిగిన ఆఫీసర్స్ క్లబ్. ఇందులో ఆఫీసర్స్‌తోపాటు పుర ప్రముఖులు కూడా సభ్యులుగా ఉండడంతో దీనికి వరంగల్ క్లబ్‌గా పేరు మార్చారు. ఇది నేడు అవినీతి, అక్రమాలకు నిలయంగా మారింది. సభ్యులకు జవాబుదారీగా వ్యవహరించాల్సిన గత పాలకవర్గాలు అడ్డగోలుగా వ్యవహరించి దందాలకు పాల్పడ్డారు. మన అనుకుంటే చాలు.. ఎంతకైనా తెగించారు. లెక్కా పత్రం లేకుండా ఒక్కో సభ్యుడి నుంచి లక్ష నుంచి మూడు లక్షల వరకు వసూలు చేసి సభ్యత్వం కల్పించారు. అయితే కొత్తగా చేరిన 154మంది సభ్యుల వాటా ధనాన్ని క్లబ్ ఖాతాలో జమ చేయకుండా దండుకున్నారు. తమ పలుకుబడిని కాపాడుకునేందుకు అక్రమంగా గుర్తింపు కార్డులు జారీ చేసి వారికి ఎన్నికల్లో పాల్గొనేలా అవకాశం కల్పించారు. క్లబ్ చైర్మన్‌గా జిల్లా కలెక్టర్ వ్యవహరిస్తున్నప్పటికీ ఏమాత్రం జంకూ బొంకూ లేకుండా గతంలో క్లబ్ కార్యదర్శులుగా పనిచేసిన ఈద ప్రేమ్ సాగర్ రెడ్డి, దొంతి రవీందర్ రెడ్డి ఇష్టారాజ్యంగా వ్యవహరించి క్లబ్ గౌరవాన్ని మంటగలిపారనే విమర్శలున్నాయి. అడిగే వారు లేకపోవడంతో వీరి అక్రమాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయిందన్న ఆరోపణలున్నాయి. మొత్తానికి వరంగల్ క్లబ్ లో జరుగుతున్న పరిణామాలు, ఆర్థిక అవకతవకలు ఆందోళన కలిగిస్తున్నాయి. - వరంగల్ వాయిస్, హనుమకొండ ప్రతినిధి

వివరాలు 2లో..



2లో

## నగరంలో సీడీఎంఏ విస్తృత పర్యటన

- సిటీ వెంచర్లతోపాటు..
- కాళోజీ కళా క్షేత్రం సదర్శన

## ఆర్యన్.. అదిరెన్

శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా మామిడి ఉషశ్రీ-ప్రదీప్ దంపతుల పుత్రరత్నం మామిడి శ్రీదీప్ ఆర్యన్ చిన్ని కన్నయ్య రూపంలో అందరినీ అలరించారు. శ్రీదీప్ ఆర్యన్ చిలిపి చేష్టలకు తాత, అమ్మమ్మ వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి-సంధ్యారాణి దంపతులు, మామ గడ్డం సాహిత్ తదితరులు పులకించి పోయారు.



# కరప్షన్ 'క్లబ్'

**ఆఫీసర్స్ క్లబ్‌లో అక్రమాలు**

**కలెక్టర్ చైర్మన్‌గా ఉన్నా రూ.4కోట్లు గోవిందా..**

**154మంది సభ్యుల సొమ్ము స్వాహా**

**ధ్రువ పత్రాలు సైతం లేని వైనం**

**వెయిటర్ ఆత్మహత్య వీడియోతో వెలుగు చూస్తున్న నిజాలు**






**వరంగల్ వాయిస్, హనుమకొండ ప్రతినిధి :** వరంగల్ క్లబ్ (ఆఫీసర్స్ క్లబ్) కు ఎంతో విశిష్టత, చారిత్రక నేపథ్యం ఉన్నది. ఈ క్లబ్ భవనాన్ని వందేళ్ళ క్రితమే నిర్మించారు. సుమారు మూడు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ భవనాన్ని నిజాం కాలంలో గెస్ట్ హౌజ్ గా వినియోగించుకున్నారు. స్వాతంత్రానంతరం దీనిని వరంగల్ ఆఫీసర్స్ క్లబ్బుకు కేటాయించారు. తరువాత దీనిని వరంగల్ క్లబ్ గా పేరు మార్చారు. హనుమకొండ సుబేదారిలోని కలెక్టర్ నివాసానికి సమీపంలో ఉన్న ఈ క్లబ్ లో షటిల్ కోర్టులు, స్విమ్మింగ్ పూల్, టెన్నిస్ కోర్ట్, అధునాతనమైన జిమ్ సెంటర్, ఆడిటోరియంతో పాటు ఇతర క్రీడలకు సంబంధించిన కోర్టులు ఉన్నాయి. జిల్లా కలెక్టర్ చైర్మన్, పోలీస్ కమిషనర్ వైస్ చైర్మన్ గా ఉండే ఈ క్లబ్ లో ప్రభుత్వ శాఖల్లో పని చేసే అధికారులు, ప్రజా ప్రతినిధులు, సంపన్నులు, సమాజంలో పలుకుబడి కలిగిన వారంతా ఇందులో సభ్యులుగా ఉండటాన్ని గౌరవంగా భావిస్తారు. క్లబ్ లో 1,692 లైఫ్ మెంబర్లు, సాధారణ సభ్యులుండగా వీరిలో కొందరు మృతి చెందిన, మరి కొందరు తమ సభ్యత్వాన్ని విత్ డ్రా చేసుకున్నారు. దీంతో ప్రస్తుతం క్లబ్ లో 1,390 మంది సభ్యులున్నారు. ఒక మేనేజర్ తో సహా 22 మంది సిబ్బంది క్లబ్ లో పనిచేస్తున్నారు.

**కలెక్టర్లతో అభివృద్ధి బాట..**

గతంలో వరంగల్ జిల్లా కలెక్టర్లుగా పని చేసిన కాకి మాధవరావు వరంగల్ క్లబ్ అభివృద్ధికి బాటలు వేస్తే.. జే.బాపు రెడ్డి, శాలిని మిశ్రా హయాంలో ఆఫీసర్స్ క్లబ్ అన్ని విధాల ఉన్నతీకరించబడింది. కలెక్టర్లుగా పనిచేసిన అజయ్ మిశ్రా, ఆదిత్యనాథ్ దాస్, కె.ప్రభాకర్ రెడ్డి, బెనహర్ మహేష్ దత్ ఎక్కా, డాక్టర్ బి.జనార్దన్ రెడ్డి, రాహుల్ బొజ్జా, రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులు ఈ క్లబ్ కు వచ్చి షటిల్ ఆడేవారు. చైర్మన్ హోదాలో అప్పుడప్పుడు కలెక్టర్ ఆమ్రపాలి, సిక్త పట్నాయక్ క్లబ్ ను సందర్శించిన సంఘటనలు ఉన్నాయి. 2007 వరకు ఒక వెలుగు వెలిగిన ఈ క్లబ్ 2008 నుంచి దాని విశిష్టత కోల్పోతూ వచ్చింది.

**ఆ ఆత్మహత్యకు కారకులెవరూ..?**

అయితే క్లబ్ లోని బార్ లో పనిచేసిన గట్టి కొప్పుల శ్రీనివాస్ క్లబ్ లో జరిగిన ఆర్థిక అవకతవకల మూలంగా 2024 ఏప్రిల్ 18న ఆత్మహత్య చేసుకున్నారు. కోట్లాది రూపాయల నిధులు దుర్వినియోగం జరిగిన నేపథ్యంలోనే ముగ్గురి కారణంగా తాను తనువు చాలిస్తున్నట్లు ఒక వీడియో వైరల్ చేసి కన్నుమూశారు. తనకు రూ.10 లక్షలు ఇస్తానని చెప్పి తనను వారు మోసగించినట్లు శ్రీనివాస్ ఆ వీడియోలో పేర్కొన్నారు. ఈ సంఘటనపై విచారణ చేపట్టిన జిల్లా పోలీస్ శాఖ ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసింది. దీంతో క్లబ్ పాలకవర్గం కూడా స్పందించి ఆ ముగ్గురిని క్లబ్ నుంచి సస్పెండ్ చేసింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత పాలకవర్గం సభ్యత్వ రుసుం జారీ, వాటా ధనం చెల్లింపులు జరిగిన తీరుపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా నిజా నిజాలను వెలికితీసేందుకు రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ మల్లారెడ్డి, రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ వీరయ్య, పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా పనిచేసిన అనుభవం ఉన్న న్యాయవాది ఈగ మల్లేశంతో కూడిన ముగ్గురు సభ్యులతో మే 2024లో కమిటీని ఏర్పాటు చేయగా మొదటి వారంలోనే విచారణ చేపట్టింది. ఈ విచారణలో అనేక అవినీతి, అక్రమాలు వెలుగు చూశాయి. సభ్యత్వ రుసుం, స్విమ్మింగ్ పూల్, బార్ , గదుల కేటాయింపులు కలుపుకొని దాదాపుగా రూ.4 కోట్ల మేరకు నిధులు దుర్వినియోగమైనట్లు ప్రస్తుత పాలకవర్గం ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చింది.

**అంతా మా ఇష్టం..**

వరంగల్ క్లబ్ లో మొత్తం 1,390 మంది శాశ్వత, సాధారణ సభ్యులున్నారు. ఇందులో 154 మంది సభ్యుల వివరాలు రికార్డుల్లో లేవు. అయినప్పటికీ గత మూడు పాలకవర్గాల నుంచి వీరు సభ్యులుగా కొనసాగుతూ వస్తున్నారు. అయితే ఈ మూడు పాలకవర్గాలు.. అంతా మా ఇష్టం అన్నట్లుగా వ్యవహరించి ఆఫీసర్స్ క్లబ్ కు చెడ్డపేరు తెచ్చారన్న ఆరోపణలున్నాయి. లేనిది ఉన్నట్లు, ఉన్నది లేనట్లుగా క్లబ్ సభ్యులను భ్రమింప చేశారన్న ఫిర్యాదులున్నాయి. నకిలీ రసీదులు, గుర్తింపు కార్డులు సృష్టించి 154 మందికి కొత్త సభ్యత్వాలు కల్పించి వారిని ఎన్నికల్లో పొల్గొనే విధంగా చూశారు. అసలు వారిని ఎవరు సూచించారు..ఎవరు నిర్ధారించారో ఎవరికి అర్థం కావడం లేదు. ముఖ్యంగా వీరికి కమిటీ నుంచి ఆమోదమే లేదు. ఈ 154 మంది సభ్యులు ఎవరికి అమౌంట్ ఇచ్చి రసీదు తీసుకున్నారో తెలియకుండా ఉండేందుకు అప్పటి క్లబ్ పెద్దలు 2016లోనే ఫైల్ మాయం చేశారన్న ఫిర్యాదులున్నాయి. ఒక్కో సభ్యుడినుంచి లక్షన్నర నుంచి రూ.3లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం. మొత్తానికి వరంగల్ క్లబ్ గత పాలకవర్గాల హయాంలో అక్రమాలు, నిధుల దుర్వినియోగానికి కేరాఫ్ అడ్రస్ గా నిలిచిందన్నది వాస్తవం. క్లబ్ లో క్షేత్రస్థాయి పరిశీలన లేకపోవడం, పాలకపక్షాన్ని ఎదిరించే దమ్ము, ధైర్యం లేకపోవడం వల్లే ఈ కుంభకోణం జరిగిందనే భావన అందరిలో ఉన్నది. క్లబ్ పై జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, వరంగల్ నగర పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ పర్యవేక్షణ లేకపోవడంతో వీరిది ఆడిందే ఆట..పాడిందే పాటగా కొనసాగింది. మొత్తానికి గతంలో క్లబ్ కార్యదర్శిగా పనిచేసిన ఈద ప్రేమ్ సాగర్ రెడ్డి, దొంతి రవీందర్ రెడ్డిలు ఈ విషయంలో స్పందించి అసలు విషయాలు తెలిపితే తప్ప నిజాలు బయటికి రావు అనే భావన క్లబ్ సభ్యుల్లో వ్యక్తం అవుతోంది. దీనిపై జిల్లా కలెక్టర్, సీపీ ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది.

# నగరంలో సీడీఎంఏ విస్తృత పర్యటన

**సిటీ వెంచర్లతో పాటు.. కాళోజీ కళా క్షేత్రం సదర్శన**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా)ఆధ్వర్యంలో ఉనికి చెర్ల వద్ద ఏర్పాటు చేసిన యునీ సిటీ వెంచర్, మడిపల్లి వద్ద ఏర్పాటు చేసిన మా సిటీ వెంచర్, వరంగల్ నగరంలోని ఓ సిటీ వెంచర్ తో పాటు ఇన్నర్ రింగ్ రోడ్డు పనులను రాష్ట్ర కమిషనర్ ఫర్ డైరెక్టరెట్ ఆఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) వివి గౌతమ్ మంగళవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం కాళోజీ కళాక్షేత్రంతో పాటు నయీంనగర్ లో నిర్మిస్తున్న హై లెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి తగు సూచనలు చేశారు. ఆయన వెంట నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్(పశ్చిమ) శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి, వైస్ చైర్మన్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే పాల్గొన్నారు. వేగంగా పనులు పూర్తి చేయుటకు అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.



**కార్మికుల సమస్యలు పరిష్కరించాలి..**

మునిసిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ,హనుమకొండ జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి, టీఎంఆర్ పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు బొట్ల భిక్షపతి, జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు ఏల్పుల ధర్మరాజు, ఐఎఫ్ టీయూసీ అధ్యక్షుడు పుల్లా రమేష్, ఉద్యోగుల సంఘం నాయకులు వినయ్ ఆధ్వర్యంలో సీడీఎంఏ కమిషనర్ వివి గౌతమ్ ను కలిసి వినతి ప్రతం అందజేశారు. గ్రేటర్ వరంగల్ లో పనిచేస్తున్న ఉద్యోగ, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, విధినిర్వహణలో మరణించిన వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకం కింద ఉద్యోగంలోకి తీసుకోవాలని, మృతి చెందిన కార్మికులకు మట్టి ఖర్చు కింద రూ.30 వేలు చెల్లించాలని, కార్మికులకు పనిముట్లు, సేఫ్టీ పరికరాలు అందజేయాలని, ప్రైవేట్ సానిటరీ ఔట్ సోర్సింగ్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వమే వేతనాలు చెల్లించాలని, కార్మికులపైన కక్ష సాధింపు చర్యలు చేయకూడదని, ఇతర అనేక సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేలా సీడీఎంఏ కృషి చేయాలని వారు కోరారు.

**ఎల్ఆర్ఎస్ ఫ్లెక్సీ ప్రదర్శించిన ఉద్యోగిపై చర్యలు**

అనధికారిక లేఔట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ కొరకు వరంగల్ మహా నగర పాలక సంస్థ కార్యాలయంలో పట్టణ ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో ఎల్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి ఈ నెల 25న కట్టిన ఫ్లెక్సీలో పొరపాటున అధికారికంగా ప్రకటించని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాజ ముద్రను ప్రదర్శించడంపై కమిషనర్ సీరియస్ అయ్యారు. పొరపాటును గుర్తించిన వెంటనే అట్టి ఫ్లెక్సీని తొలగించి వాటి స్థానంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రాజసముద్రతో ఉన్న ఫ్లెక్సీ ని ప్రదర్శించడంతోపాటు దానికి బాధ్యులైన టౌన్ ప్లానింగ్ అధికారులకు మెమోలు జారీ చేసి చర్యలు తీసుకోవడం జరుగుతున్నదని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే నేడు ఒక ప్రకటనలో తెలిపారు.

# ఎంఏ తెలుగు ప్రవేశ గడువు 31 వరకు పెంపు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ ప్రాంగణంలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2024-25 సంవత్సరానికి ఆలస్య రుసుముతో ఎంఏ తెలుగు రెగ్యులర్ కోర్సు ప్రవేశానికి గడువు ఈ నెల 24 తో ముగిసింది. విద్యార్థుల విజ్ఞప్తుల మేరకు రూ.100 అలస్య రుసుముతో ఆగస్ట్ 31 వరకు పొడిగించినట్లు జానపదగిరిజన విజ్ఞాన పీఠం పీఠాధిపతి ప్రొఫెసర్ భూక్య బాబురావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని తెలుగు యూనివర్సిటీ వెబ్సైట్ www.teluguuniversity.ac.in, www.pstucet.org దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



# గ్రామాల సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**వరంగల్ వాయిస్, గణపురం :** మండలంలోని బుద్దారం గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంగళవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ముందుగా గ్రామంలోని పర్వత వర్ధిని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రూ.5 లక్షలతో నూతనంగా నిర్మించిన రజక కమ్యూనిటీ భవనాన్ని ఎమ్మెల్యే కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం రూ.14.1లక్షలతో నూతనంగా నిర్మించనున్న యాదవ కమ్యూనిటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా, రూ.25 లక్షలతో నూతన నిర్మించనున్న ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.25 లక్షలతో నూతనంగా నిర్మించనున్న ముదిరాజ్ కమ్యూనిటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. చివరగా, రూ.970 లక్షలతో బుద్దారం గ్రామం నుంచి రామన్నగూడెం తండా వరకు నూతన బీటీ రోడ్డు నిర్మాణం, రూ.297 లక్షలతో రోడ్డు వద్ద కల్వర్టుల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాపాలనలో అన్ని గ్రామాల సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందుకు కట్టుబడి ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. సదరు గుత్తేదారు పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, నాయకులు, ప్రజలు ఉన్నారు.


# కేవులతండాను సందర్శించిన డీఎంహెచ్ఓ



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మండల పరిధిలోని వెంకటాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని కేవులతండాలో జ్వరంతో మంగళవారం తెల్లవారు జామున బానోతు లిచ్చిరామ్ వర్ధన్నపేటలో గల ఒక ప్రైవేట్ హాస్పిటలలో మరణించారు. ఈ విషయం తెలిసిన వెంటనే మహబూబాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కేవులతండాను సందర్శించి జ్వరంతో చనిపోయిన వారి ఇంటికి వెళ్లి వివరాలు అడిగి తెలుసుకోవడం జరిగింది. గ్రామంలో ఇంటింటికి వెళ్లి రాపిడి జ్వరం సర్వే చేయమని వైద్య సిబ్బందిని ఆదేశించారు. జ్వరం ఉన్న వారికి వెంటనే చికిత్స అందజేయమని వైద్య సిబ్బందిని పురమాయించారు. వారితో పాటు డాక్టర్ జ్వలిత, డిప్యూటీ స్టాఫ్, సూపర్ వైజర్లు, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

# ఆసియాకు ఇంటర్నేషనల్ కరాటే పోటీల్లో పతకాలు

## సన్మానించిన ఎంపీ కడియం కావ్య



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఈనెల 24, 25 తేదీలలో కర్ణాటక రాష్ట్రం బెంగళూరు శివ మొగ్గ జిల్లాలో జరిగిన ఇంటర్నేషనల్ కరాటే పోటీల్లో టీఎంఆర్ఎస్ (జేసీ) లో ఇంటర్ బైపీసీ చదువుతున్న విద్యార్థిని ఎండీ ఆసియా వ్యక్తిగత కట విభాగంలో బంగారు పతకం, అండర్ 16 స్పారింగ్ లో కాంస్య పతకం సాధించింది. బంగారు, కాంస్య పతకాలను ఆసియా సాధించడంతో మంగళవారం ఆసియాను ఎంపీ కడియం కావ్య ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ చదువుతో పాటు మార్షల్ ఆర్ట్స్ లో రాణిస్తున్న ఆసియా భవిష్యత్తులో మరిన్ని పతకాలతో మంచి పేరు సంపాదించుకోవాలన్నారు. మహిళల పట్ల సమాజంలో జరుగుతున్న సంఘటనలకు తనకు తాను రక్షించుకునే విధంగా సెల్ఫ్ డిఫెన్స్ ఎంతో అవసరమని ప్రత్యేకంగా ఆసియా శిక్షణ తీసుకుంటున్న బీఎంఆర్ మార్షల్ ఆర్ట్స్ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఫౌండర్ మాస్టర్ బండారి సంతోష్ ను అభినందించారు. బెంగళూరులో ఆరు దేశాలు పాల్గొన్న ఇంటర్నేషనల్ కరాటే ఛాంపియన్ షిప్ లో పతకాలు సాధించిన ఆసియాను టీఎంఆర్ఎస్ కళాశాల ప్రిన్సిపాల్ సిబ్బంది, బీఎంఆర్ కరాటే అకాడమీ మాస్టర్ కర్ర వెంకటేష్, సుప్రియ రణదీప్, వైష్ణవి, దినేష్, గణేష్ పలువురు అభినందనలు తెలిపారు.

# పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు

## ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి




**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** పార్టీలకు అతీతంగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆత్మకూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆత్మకూరు మండలానికి చెందిన 52 మంది లబ్ధిదారులకు రూ.52 లక్షల 6వేల 32 విలువ గల కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను, 18 మంది లబ్ధిదారులకు రూ.4 లక్షల 22వేల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను దామెర మండలానికి చెందిన 16 మంది లబ్ధిదారులకు రూ.16 లక్షల 1856 విలువ గల కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు,18 మంది లబ్ధిదారులకు 5 లక్షల 40 వేల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ పేద ప్రజలకు వరమన్నారు. గతంలో ఎమ్మెల్యే, ఎంపీల కార్యాలయాల వద్ద చెక్కుల కోసం పడిగాపులు కాచేవారని నేడు లబ్ధిదారులకు నేరుగా అందజేయడం జరుగుతుందన్నారు. పేదింటి ఆడబిడ్డలకు అండగా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు నిలుస్తున్నాయన్నారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక పరకాల నియోజకవర్గ వ్యాప్తంగా 814 మంది లబ్ధిదారులకు రూ.8 కోట్ల 14 లక్షల 94 వేల424 కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను, 609 మంది లబ్ధిదారులకు రూ. 1కోటి 93 లక్షల 61 వేల 600 ల విలువగల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిసహాయంతో పంపిణీ చేశామని తెలిపారు. ఇప్పటివరకు పరకాల నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 1423 మంది లబ్ధిదారులకు రూ.10 కోట్ల 8 లక్షల 56 వేల 249 ల విలువ గల చెక్కులను పంపిణీ చేశామన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చి రాష్ట్రాన్ని దివాలా తీయించడమే కాకుండా నిరుపేదలకు అందించాల్సిన కళ్యాణ లక్ష్మి పథకం, సీఎంఆర్ఎఫ్ లో కూడా అవినీతికి పాల్పడిందన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్న ప్రతి పేదవాడి ఆదుకోవాలనే సంకల్పంతో గత ప్రభుత్వంలో పెండింగ్ లో ఉన్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కూడా మంజూరు చేసి అందించిన సీఎం రేవంత్ రెడ్డికి లబ్ధిదారుల తరఫున ధన్యవాదాలు తెలిపారు.

# విలీన గ్రామాలకు ఆర్ఓఆర్-2024ను వర్తింప చేయాలి

## ఏబీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.మహేందర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువస్తున్న ఆర్ఓఆర్-2024 చట్టంలో గ్రేటర్ వరంగల్ మునిసిపాలిటీ పరిధిలోని 32 విలీన గ్రామాలలోని సాదా బైనామాల ద్వారా కొనుగోలు చేసిన రైతులకు అవకాశం కల్పించి పట్టాదారు పాసుబుక్కులు మంజూరు చేయాలని ప్రముఖ న్యాయవాది, అసైన్డ్ భూమి సమితి (ఏబీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్ డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రైతులందరికీ చెందిన పట్టా, అసైన్డ్, ఇనాం, భూదాన్ భూములన్నింటిని కొత్త ఆర్ఓఆర్ చట్టం ద్వారా క్రమబద్ధీకరించడానికి అవకాశం కల్పించాలన్నారు. కొత్త చట్టం అమలు కోసం ప్రజల నుంచి సలహాలు, సూచనలు, అభిప్రాయాలను తీసుకోవాలని, ఇందుకు రెండు నెలల దాకా గడువును పొడిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, రైతు సంఘం నాయకుడు నేరెళ్ల బస్వారెడ్డి, ఏబీఎస్ నాయకులు పోలేపాక మల్లేశం, మోరే ఐలయ్య, కొలిపాక రమేష్, మంద ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# చేనేత కులాల అభివృద్ధికి కృషి చేయాలి

## ఏఐడబ్ల్యూఎఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గం డిమాండ్



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర శాఖకార్యవర్గ సమావేశం ఆదివారం ఖైరతాబాద్ చింతల్ బస్తీలోని కుర్ని వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగింది. దీనికి బసబత్తిని రాజేశం అధ్యక్షత వహించారు. శ్రీ బండారు ఆనంద ప్రసాదు ఏఐడబ్ల్యూఎఫ్ జాతీయ అధ్యక్షుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో చేనేత కులాల ఫైనాన్స్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి, అన్ని చేనేత కులాలకు అభివృద్ధి కోసం ఆర్థిక సహాయం చేయాలి, చేనేత కులాలు అన్నింటికి సామాజిక భవనాలు నిర్మించుటకు స్థలం కేటాయించి భవన నిర్మాణానికి ఆర్థిక సాయం చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత పరిశ్రమ అభివృద్ధి కోసం కేంద్రం రూ.5000 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం రూ.1000 కోట్ల బడ్జెట్ కేటాయించాలని, చేనేతపై విధించిన జీఎస్టీని వెంటనే రద్దు చేయాలని, చేనేత కులాల వారికి రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పదవులను తగిన నిష్పత్తిలో ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో 18 చేనేత కుల సంఘాల నాయకులు పీజీకే వెంకటేశ్వర్ రావు, గవ్వల శంకర్, చోళ్ల రాజేశ్వర్, గడ్డం వెంకటేశ్వర్లు, రాపోల్ జగన్, రాపోల్ జ్ఞానేశ్వర్, బోగం లక్ష్మయ్య, పాశికంటి లక్ష్మి నర్సయ్య, బి.క్రిష్ణారావు, కడారి శ్రీధర్, మోటుపల్లి గోపి, సరళ రాఘవేంద్ర, బుగుడే రాజు, రవి చంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# యూరియా కొరతను తీర్చాలి



**వరంగల్ వాయిస్, నెల్లికుదురు :** మండల కేంద్రంలోని ప్రభుత్వ అతిథి గృహంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ప్రజాబంధ ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రవి మాట్లాడుతూ జిల్లాలో సాగు విస్తీర్ణానికి అవసరమగు ఎరువులను ముందస్తు ప్రణాళిక ప్రకారం సమకూర్చాల్సిన వ్యవసాయ శాఖ దొంగ నిద్ర నటిస్తుందని ఆరోపించారు. ఫలితంగా నేడు యూరియా కొరతతో రైతాంగం చెప్పులు అరిగేలా తిరుగుతుందని మండిపడ్డారు. ప్రైవేట్ షాపులలో అధిక ధరలకు అమ్మటమే కాకుండా ఇతర మందులు కొనాలని లింకులు పెట్టి అదనపు ఆర్థిక భారాన్ని రైతాంగంపై మోపుతున్నారని అన్నారు. వ్యవసాయ శాఖ జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని యుద్ధ ప్రాతిపదికన జిల్లా రైతాంగ యురియా కొరతను తీర్చాలన్నారు. అదేవిధంగా నేడు జిల్లాలో విష జ్వరాల ప్రభావంతో ఇంటికి ఒకరు జ్వర పీడితులుగా మారి అనేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వ హాస్పిటల్స్ కు పోతే సరైన వైద్యం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పల్లె దవాఖానాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో డాక్టర్స్, సిబ్బంది కొరత, సరైన పరీక్షలు నిర్వహించటం లేదని, అవసరమగు మందులు లేవని తిప్పి పంపడం జరుగుతుందని ఆరోపించారు. పల్లె దవాఖానాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా జనరల్ ఆసుపత్రిలో డాక్టర్లను, మందులను అందుబాటులో ఉంచాలని ఆయన కోరారు. ప్రైవేట్ హాస్పిటల్స్, కార్పొరేట్ హస్పిటల్స్ ఫీజుల దోపిడీ, మందుల దందా తదితర సమస్యలను పరిష్కరించడానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలని కోరారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ప్రజాబంధ తొర్రూరు డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న, డివిజన్ నాయకులు బండపల్లి వెంకటేశ్వర్లు, మండల నాయకులు జక్కుల యాకయ్య, పల్లెల పాపారావు, బూరుగుల మోష తో పాటు గుగులోత్ రామోజీ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

# అధికారులు ప్రజల కోసం పని చేయాలి

## ఎమ్మెల్యే డా.మురళి నాయక్




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ప్రజల సమస్యతో వస్తే వెంటనే స్పందించి పరిష్కారం చేయండని, ప్రతినెల సంబంధిత అధికారులు రివ్యూ మీటింగ్ లో పాల్గొనాల్సిందేనని, రివ్యూ మీటింగ్ లో పాల్గొనని అధికారులపై తక్షణమే చర్యలు ఉంటాయని ఎమ్మెల్యే డా.మురళి నాయక్ అన్నారు. మండల అధికారులు, మొదలగు గ్రామస్థాయి సెక్రటరీ వరకు రివ్యూ మీటింగ్ లో పాల్గొని పాయింట్ టు పాయింట్ చెప్పాల్సిందేనన్నారు. మండల కేంద్రంలో ఉన్న ప్రతి గ్రామంలో తాగునీటి సమస్య, కొరత ఉండకూడదని, వైద్యాధికారులు నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదని, నియోజకవర్గంలో విష జ్వరాలు విజృంభిస్తుండటంతో ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. తక్షణమే వైద్యులు వారి సేవలో నిమగ్నమై ఉండాలని, రెవెన్యూ అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. విద్యుత్ అధికారులు నిత్యం రైతుల విషయంలో విద్యుత్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఉన్నారు. ఏ ఒక్క అధికారికైనా సరే ప్రజలు ఫోన్ చేస్తే తక్షణమే స్పందించాలన్నారు. ఫోనులో స్పందించని యెడల ఆ బాధితులు నా దగ్గరికి వస్తే మాత్రం అధికారుల పైన కొరడా ఝులిపించి కఠిన చర్యలు వెంటనే తీసుకుంటానని హెచ్చరించారు. అధికారుల వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తే మాత్రం సహించబోమన్నారు. మహబూబాబాద్ మండల కేంద్రంలో అధికారుల జనరల్ బాడీ రివ్యూ మీటింగ్ కార్యక్రమంలో పాల్గొన్న మహబూబాబాద్ శాసనసభ్యుడు డాక్టర్ భూక్య మురళి నాయక్ ఈ కార్యక్రమం అనంతరం అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రజా కార్యక్రమాలు ప్రజలకు అందే విధంగా అహర్నిశల అధికారులు కృషిచేయాలని సూచించారు. లేకుంటే వారిపై కఠిన చర్యలు ఉంటాయని, కచ్చితంగా అధికారులు ప్రజల పక్షాన నిత్యం పనిచేయాలన్నారు. వారి నుంచి ఎలాంటి కంప్లైంట్స్ నా వద్దకు రాకుండా అధికారులు సక్రమంగా పనిచేయాలని ఎమ్మెల్యే అధికారులకు ఉద్బోధించారు. ఈ కార్యక్రమానికి మండల ప్రభుత్వ ఉద్యోగులు గ్రామపంచాయతీ సిబ్బంది, పోలీసు, ఇలాగే అగ్రికల్చర్ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, జిల్లా నాయకులు, మండల ముఖ్య నాయకులు, సీనియర్ నాయకులు, యూత్ అధ్యక్షులు, నాయకులు, మాజీ సర్పంచులు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మార్కెట్ ప్రస్తుత చైర్మన్లు, మాజీ చైర్మన్లు, గ్రామ పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వైద్యురాలి ఘటనపై నిందితులను శిక్షించాలి




**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలో భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కోల్ కత్తా డాక్టర్ పై జరిగిన హత్యాచారం చేసిన నిందితులను తక్షణమే ఉరితీయాలని డిమాండ్ చేస్తూ వి వాంట్ జస్టిస్ అనే నినాదాలతో విద్యార్థులతో, కళాశాల నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు 200 మంది విద్యార్థులతో ర్యాలీ తీశారు. ముఖ్యఅతిథిగా వరంగల్ జిల్లా అధ్యక్షుడు చుక్క ప్రశాంత్ పాల్గొన్నారు. అనంతరం ఎస్ఎఫ్ఐ వరంగల్ జిల్లా అధ్యక్షుడు చుక్క ప్రశాంత్ మాట్లాడుతూ ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ, ఆస్పత్రిలో ట్రైనీ పీజీ డాక్టర్గా విధులు నిర్వహిస్తున్న 31 ఏళ్ల యువతిపై అత్యంత దారుణంగా అత్యాచారం, చేసి హత్య చేశారన్నారని, ఇది ముమ్మాటికి సామూహిక అత్యాచారామని అన్నారు. ఈ కేసులో బెంగాల్ ప్రభుత్వం, కోల్‌కతా పోలీసులు నిర్లక్షం చేశారని మండిపడ్డారు. కాబట్టి, సీబీఐకి ఈ కేసును అప్పజెప్పి వైద్యురాలి కుటుంబానికి న్యాయం చేసి, దోషులను పట్టుకోవాలన్నారు. ఈ సంఘటపై సమగ్ర విచారణ జరిపి, దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఎస్ఎఫ్ఐ పర్వతగిరి మండల కార్యదర్శి ఎద్దు రాహుల్ మాట్లాడుతూ ఈ సంఘటనలో కేవలం ఒకరో, ఇద్దరో వ్యక్తుల ప్రమేయం కాకుండా ఆ కాలేజీలో ఉన్నత స్థానాల్లో ఉన్న అధికారులు సంఘ వ్యతిరేక శక్తులో కుమ్మక్కై డ్రగ్స్, సెక్స్ రాకెట్ నిర్వహిస్తున్నట్లుగా వార్తలు వస్తున్నాయని అన్నారు. నిషేధించిన డ్రగ్స్ వాడుతున్న కాలేజీ యజమాన్యం నిర్లక్ష్యం వల్లే జరిగిందనుకోవచ్చు గతంలో ఇలాంటివి జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పర్వతగిరి మండల కమిటీ రమ్య శ్రీ, అద్విక, దీక్ష, నాయకులు ఉల్లెంగుల సిద్దు, దామసాని సంతోష్ కుమార్, రమాసాని సుమంత్, రాచా ప్రదీప్, ముదురుకోళ్ల అభి, వేల్పుల చరణ్, మండల రాజు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పోచమ్మ బోనాలకు ఆహ్వానం



**వరంగల్ వాయిస్, న్యూ శాయంపేట :** ఈ నెల 29న శ్రావణమాసం చివరి గురువారం సందర్భంగా 31వ డివిజన్ న్యూ శాయంపేటలో శ్రీ పోచమ్మ తల్లి బోనాల మహోత్సవం అంగరంగా వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పోచమ్మ తల్లి బోనాల మహోత్సవానికి హాజరు కావాలని స్థానిక శాసనసభ్యుడు, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి, ఎంపీ కడియం కావ్యను స్థానిక కార్పొరేటర్ మామిండ్ల రాజు మంగళవారం వారిని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించి తప్పకుండా రావాలని కోరారు.

## ఉచిత కంటి పరీక్ష శిబిరం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సత్యం గ్రూప్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ గంట రవికుమార్ ఆధ్వర్యంలో వాసన్ హై కేర్ వారు సత్యం కంప్యూటర్ ఎడ్యుకేషన్ వరంగల్ బ్రాంచ్ లో మంగళవారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 300 మంది విద్యార్థులు కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ శిబిరంలో వాసన్ ఐ కేర్ సిబ్బంది ఆధునిక కంటి పరీక్ష పరికరాలతో పరీక్షలు నిర్వహించారు. పరీక్షలు చేయించుకున్న విద్యార్థులకు ఒక కూపన్ కూడా అందజేశారు. ఈ కూపన్ ద్వారా మరో ముగ్గురు ఉచిత కంటి పరీక్షలు చేయించుకునేందుకు ఆకాశం ఉంటుందని,కంటికి అద్దాలు అవసరమైన వారికి ఈ కూపన్ ద్వారా రాయితీ లభిస్తుందని వాసన్ ఐ కేర్ సిబ్బంది తెలిపారు. ఈ శిబిరంలో పాల్గొన్న వాసన్ ఐకేర్ సిబ్బందికి సత్యం కంప్యూటర్ ఎడ్యుకేషన్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ గంట రవికుమార్, డైరెక్టర్ కందుకూరి విజయ్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

## సాగంటి మంజులకు జాతీయ అవార్డు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరానికి చెందిన ప్రముఖ చిత్రకారిణి, ఎల్ బీ కళాశాల బీఎడ్, లెక్చరర్, సామాజిక వేత్త, సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్ మంజులకు మంగళవారం విజయవాడలో జరిగిన మదర్ థెరిస్సా సర్వీస్ సొసైటీ రెండవ వార్షికోత్సవం సందర్భంగా నందమూరి తారక రామారావు జాతీయ అవార్డు-2024ను అందించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా పలు రాష్ట్రాల నుంచి వివిధ రంగాల్లో సేవ చేసిన వారికి ఈ సత్కారం చేశారు. మంజుల ఉపాధ్యాయ కళాశాలలో లెక్చరర్ గా విధులు నిర్వర్తిస్తూ, తన అకాడమి ద్వారా చిత్రకళా రంగానికి, తనదైన శైలిలో సేవ చేస్తూ, ఎంతో మంది చిన్నారులకు చిత్ర కళలో మెలకువలు నేర్పిస్తున్నారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షులు డాక్టర్ ప్రసాద్ తో పాటు అతిథులు మంజులను అభినందించి శాలువా, ప్రశంసా పత్రం, జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. పలువురు ప్రముఖులు, స్థానిక ఆర్టిస్టులు, ఎల్ బీ కాలేజీ లెక్చరర్స్ మంజులకు అభినందనలు తెలిపారు. ఆమె సొసైటీ బాధ్యులకు, తోటి స్థానిక ఆర్టిస్టులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎమ్మెల్సీ కవితకు బెయిలుపై బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు హరి రమాదేవి హర్షం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు మంగళవారం అత్యున్నత న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకురాలు డా.హరి రమాదేవి వరంగల్ లోని తన క్లినిక్ లో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

## భూ కబ్జాదారులపై చర్యలు తీసుకుంటాం



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా కేంద్రంలో గత 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ భూములు యథేచ్ఛగా అన్యాక్రాంతమయ్యాయని, ఆ భూములను స్వాధీనం చేసుకొని ఆ భూములను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని ఎంపీ బలరాం నాయక్ అన్నారు. మహబూబాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు అర్పించిన మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహాన్ని సచివాలయంలో ఏర్పాటు చేస్తే తప్పేమిటని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డిపై ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు చేసిన పరుష పదజాలంతో దూషించిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇలాంటి ఘటనలు పునరావృత్తమైతే సహించేది లేదన్నారు. పట్టణంలో 40 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉంటే గురుకుల క్రీడా ఆశ్రమ పాఠశాల నెలకొల్పేందుకు కృషి చేయడమే గాకుండా 500 పడకల ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయిస్తానని స్పష్టం చేశారు. ఈ మీడియా సమావేశంలో ఎమ్మెల్యేలు డాక్టర్ మురళీ నాయక్, రాంచంద్రు నాయక్, డీసీసీ అధ్యక్షులు భరత్ చందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక



**వరంగల్ వాయిస్, నడికూడ :** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. నడికూడ మండలం రాయపర్తికి గ్రామానికీ చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు చల్లా ఇంద్రసేనారెడ్డి, రఘుపతి రెడ్డి, ఎన్ఆర్ఐ కాంగ్రెస్ నాయకుడు పోచంపల్లి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాధారణంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న అసత్యపు ప్రచారాలను తిప్పి కొట్టాలని, కాంగ్రెస్ పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోచంపల్లి ప్రతాపరెడ్డి, కొత్త ఈశ్వర్ రెడ్డి, పింగిలి సురేందర్ రెడ్డి, ఊర రవీందర్ రెడ్డి రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరంగా నిలుస్తోందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని హనుమకొండ కనకదుర్గ కాలనీలోని ఎంపీ నివాసంలో మంగళవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. హనుమకొండ కుమార్ పల్లికి చెందిన మోహినమ్మకు రూ.40 వేలు, పాలకుర్తి మండలం, గూడూరుకు చెందిన మారేపల్లి ప్రభాకర్ కు రూ.60వేలు, చిల్పూరు మండలానికి చెందిన హైమకు రూ.48 వేలు, కాజీపేట మండలం, రాంపూర్ కు చెందిన అశోక్ కు రూ.20 వేలు, జనగామ జిల్లా నడిమెట్ట మండలం, గండిరామారానికి చెందిన రజితకు రూ.10,500 చెక్కులను ఎంపీ డా. కడియం కావ్య స్వయంగా బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధితో నేడు నిరుపేదలు కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొంది ప్రాణాలు కాపాడుకుంటున్నారని తెలిపారు. నిరుపేదల ఆరోగ్యం విషయంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## కిషోర బాలికల సంఘాలపై శిక్షణ



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** మథర్ థెరిస్సా మండల సమాఖ్య అధ్యరంలో కిషోర బాలికల సంఘాల గురించి వీఓఏలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమానికి ఎంపీడీఓ శంకర్ నాయక్ హాజరై మాట్లాడారు. 15 నుంచి19 సంవత్సరాల వరకు ఉన్న బాలికలను సంఘాలుగా ఏర్పాటు చేసి వారి హక్కులు, వారే పొందే విధంగా వారిని తీర్చిదిద్దాలని తెలియజేశారు. ఈ సంఘాలతో బాల్య వివాహాలు అరికట్టడానికి, వారి ఆరోగ్య సమస్యలు పరిష్కారానికి, నైపుణ్యాభివృద్ధి శిక్షణాలు పొందడానికి సాధ్యమవుతుందని తెలియజేశారు. ఈనాటి బాలలే రేపటి పౌరులు కాబట్టి, వారిని ఈ సమయంలో మంచి పౌరులుగా తీర్చిదిద్దడానికి మన జిల్లాను పొలైట్ ప్రాజెక్టు గా తీసుకోవడం మన అదృష్టమని, కిషోర బాలికల సంఘాల ఏర్పాటులో మన మండలాన్ని జిల్లాలో ముందు ఉంచాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ఏపీఎం తోటకూరి క్రిష్ణమూర్తి, సీసీలు, రమాదేవి, కాంతయ్య, రవీందర్ రాజు, సుధాకర్, వీఓఏలు ఎంఎస్ఓబీ నాగమణి, భాగ్యలక్ష్మి, లత, మండల సమాఖ్య సిబ్బంది హాజరయ్యారు.

## కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయకుంటే అగ్నిగుండమే

### ప్రముఖ న్యాయవాది కలకోట మహేందర్



**వరంగల్ వాయిస్, గీసుకొండ :** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ ను వెంటనే అమలుచేసి బీసీల రిజర్వేషన్లను 42 శాతం పెంచాలని లేనిపక్షంలో అన్ని సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమించి రాష్ట్రాన్ని అగ్నిగుండంగా మారుస్తామని ప్రముఖ న్యాయవాది, అసైన్డ్ భూమి సమితి (ఏబీఎస్)వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్ హెచ్చరించారు. మంగళవారం వరంగల్ జిల్లా గీసుగొండలో కామారెడ్డి డిక్లరేషన్ అమలు కోసం రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్ గాడ్గే చేస్తున్న ఆమరణ నిరాహార దీక్షను ప్రారంభించి, మద్దతు తెలిపి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు బీసీలను రాజకీయంగా వాడుకుంటూ మోసం చేశాయని, రాష్ట్రంలో బీసీల రిజర్వేషన్లను 42శాతం పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని, దీని కోసం బీసీలందరూ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమకారుడు దామెర కొమురయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో గత మూడు రోజుల నుంచి కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలని బీసీ నాయకులు ఆమరణ నిరాహార దీక్ష చేస్తుంటే ప్రభుత్వం చోద్యం చూస్తుందన్నారు. వారికి ఏదైనా జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఆమరణ నిరహార దీక్ష చేస్తున్న చాపర్తి కుమార్ గాడ్గే మాట్లాడుతూ బీసీల కోసం నేను చేస్తున్న పోరాటం ఆగదని, ఈ పోరాటంలో ప్రాణ త్యాగానికైనా సిద్ధమని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, కందికొండ సాంబయ్య, కందికొండ అనిల్, దిడ్డి ధనలక్ష్మి, కందికొండ కొమరమ్మ, పందికొండ రమ, చాపర్తి ఎల్లమ్మ, చాపర్తి యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కేయూకి రెగ్యులర్ వీసీని నియమించాలి

### ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ యూనివర్సిటీకి రెగ్యులర్ వీసీని నియమించి కాకతీయ యూనివర్సిటీలో ఉన్న విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ అన్నారు. మంగళవారం కాకతీయ యూనివర్సిటీలో మీడియా సమావేశంలో పాల్గొని నరేష్ మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీకి రెగ్యులర్ వీసీని నియమించి యూనివర్సిటీలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. కాకతీయ యూనివర్సిటీలో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. పీజీ పూర్తి చేసిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రియింబర్స్ మెంట్ విడుదల చేయకపోవడంతో యూనివర్సిటీ అధికారులు విద్యార్థులకు సర్టిఫికెట్స్ ఇవ్వకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదేవిదంగా వివిధ డిపార్ట్మెంట్ లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని, విద్యార్థులకు కోర్స్ ఫీజులు పెంచడం జరిగిందని, తక్షణమే యూనివర్సిటీ అధికారులు స్పందించి ఫీజులు తగ్గించాలన్నారు. హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని, విద్యార్థులు ఉంటున్న హాస్టల్స్ లో అనేకమైన సమస్యలు ఉన్నాయని, ఎన్నోసార్లు యూనివర్సిటీ అధికారులకు విన్నవించిన యూనివర్సిటీ అధికారులు స్పందించడం లేదన్నారు. హాస్టల్స్ లో ఉన్న సమస్యలనీ పరిష్కరించాలని, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి యూనివర్సిటీకి ఎక్కువ బడ్జెట్ కేటాయించి విద్యార్థులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏబీఎస్ఎఫ్ కేయూ నాయకులు భరత్, రాజ్, అశోక్, రత్నాకర్, కిరణ్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్యంపై ప్రభుత్వానికి ప్రత్యేక శ్రద్ధ

### ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వర్షాకాలంలో ప్రమాదకరమైన దోమల విహారంతో ప్రబలుతున్న విషజ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వైద్య సిబ్బంది వార్డులలో పర్యటిస్తూ జ్వర పరీక్షలు చేయాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం 52వ డివిజన్ లోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. వైద్య శిబిరంలో జరుగుతున్న పరీక్షలను నిశితంగా పరిశీలించారు. ఉచిత వైద్య శిబిరాలను నియోజకవర్గ పరిధిలో అన్ని వార్డుల్లో నిర్వహించేలా చూడాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ఆదేశించారు. ఉచిత శిబిరాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకునేలా ముందస్తు ప్రణాళికను విడుదల చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే అలిపుర బడి మసీద్ కాలనీలో అధికారులతో కలిసి పర్యవేక్షించారు. వార్డులో ఉన్నటువంటి సమస్యలను నేరుగా ప్రజల్ని అడిగి తెలుసుకుంటూ సాగారు. ప్రధాన సమస్యగా ఉన్న డ్రైనేజ్ అంతర్గత రోడ్ల నిర్మాణాలు, పేరుకుపోయిన చెత్త చెదారం పట్ల ఆసహనం వ్యక్తం చేశారు. మున్సిపల్ సిబ్బంది ఎప్పటికప్పుడు వార్డులలో పర్యటించాలని చెత్తాచెదారం ఉంటే ఉపేక్షించేది లేదన్నారు. యుద్ధ ప్రాతిపదికన సైడ్ డ్రైన్ నిర్మాణం, కమ్యూనిటీ హాల్ మిగిలిన పనుల కోసం అంచనాలు వేసి తీసుకొస్తే తక్షణమే నిధులు మంజూరు ఇస్తానని తెలిపారు. ఇప్పటికే తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలులో జరుగుతున్న అక్కడక్కడా వస్తున్న అభ్యర్థనలను అధికారులు, స్థానిక నాయకులు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణం త్వరగతిన పూర్తి చేసి, కాలనీ మహిళలకు అందుబాటులోకి ఉంచుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాలనీవాసులు, అధికారులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై షీ టీమ్ అవగాహన సదస్సు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నేరాలు, అఘాయిత్యాలు పెరుగుతున్న నేటి కాలంలో నేరాల అదుపులో విద్యార్థులు కీలకపాత్ర పోషించాలని, జాగ్రత్తతో మెలగడం వల్ల నేరాలను అదుపు చేయవచ్చని వరంగల్ షీ టీమ్ ఇన్ స్పెక్టర్ కె .సుజాత అన్నారు. కీస్ హైస్కూల్, రామన్నపేటలో దాదాపు 150 మంది విద్యార్థులకు సైబర్ నేరాలు, మహిళలపై అత్యాచారాలు, విద్యార్థులపై జరుగుతున్న అఘాయిత్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇన్ స్పెక్టర్ సుజాత పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు ఈవ్ టీజింగ్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పై అవగాహన పెంచుకోవాలన్నారు. ముఖ్యంగా అమ్మాయిలు ఫేస్ బుక్, ఇన్ స్టాగ్రామ్ లాంటి సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫొటోలు, వివరాలు పంచుకోవడంలో జాగ్రత్త వహించాలని, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సైబర్ నేరాలు జరిగితే టోల్ ఫ్రీ1930 కి ఫిర్యాదు చేయాలని, గుర్తు తెలియని నెంబర్స్ నుంచి మహిళలకు ఎవరి నుండైన ఇబ్బందులకు గురైనప్పుడు, ఎవరైనా మహిళలపై అనుచితంగా, అసభ్యంగా ప్రవర్తించినట్లైతే ధైర్యంగా షీ టీమ్ కు సమాచారం ఇవ్వాలని, షీ టీమ్ మొబైల్ నంబర్స్ సీపీ వాట్సాప్ నంబర్ 8712685257, సీఐ వాట్సాప్ నెంబర్ 8712685142, ఎస్ఐ వాట్సాప్ నెంబర్ 8712685270 లకు ఫిర్యాదు చేసిన వివరాలను గోప్యంగా ఉంచి నేరస్థులకు కౌన్సిలింగ్ ఇచ్చి చర్య తీసుకుంటామన్నారు. విద్యార్థులు సమస్యలు ఎదురైనప్పుడు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో పంచుకోవాలని, అలా పంచుకోవడం ద్వారా నేరాలను ప్రాథమిక దశలో నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై.విద్యాసాగర్, కె.వసంత లక్ష్మి, అనిస్, స్వాతి, వై.భవ్య నాగు, షీ టీమ్ నుంచి హెడ్ కానిస్టేబుల్ బి.సూర్యనారాయణ, కానిస్టేబుల్ కె.వంశీకృష్ణ, ఉమెన్ కానిస్టేబుల్ సువార్త తదితరులు పాల్గొన్నారు.

## విశ్వ విద్యాలయానికి పరీక్షల విభాగం గుండె కాయ

### రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి



**వరంగల్ వాయిస్, కేయూ :** “విశ్వవిద్యాలయానికి పరీక్షల విభాగం గుండె కాయ”అని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి అన్నారు. ఎంపిక చేసిన బోధనేతర ఉద్యోగుల నాలుగు వారాల కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాంలో భాగంగా చివరి వారం “యూనివర్సిటీ ఆక్ట్, స్టాట్యుటూట్స్, విశ్వవిద్యాలయ రోజు వారి పరిపాలన, అకౌంట్స్, ఆడిట్ మాడ్యుల్” లో “పరిక్షల విభాగం”అనే అంశంపై మంగళవారం కంప్యూటర్ సైన్సు విభాగ సెమినార్ హాల్ లో ఉపన్యాసం చేశారు. విద్యార్థి పరీక్షా ఫీజు దరఖాస్తు నుంచి ఫలితాల వెల్లడి తరువాత ఇచ్చే మెమో (ధ్రువపత్రాల) వరకు ఉన్న వివిధ స్టేజీలను, ఆ సందర్భాలలో తిసుకోవాల్సిన జాగ్రత్తలు, వచ్చే సందేహాలు, నివృత్తి చేశారు. పరీక్షల విభాగ పని తీరుపై మొత్తం సమాజంలో యూనివర్సిటీ పేరు ప్రతిష్టలు ఆధారపడి ఉంటాయని, దీనిని దృష్టిలో ఉంచుకొని ఉద్యోగులు చాలా నిజాయతీగా, పారదర్శకతతో, జవాబుదారీతనంతో పని చేయాలనీ, తరువాతి ఉద్యోగులకు తెలియ చేయాలని తెలిపారు. వివిధ స్టేజీలను పవర్ పాయింట్ ద్వారా ఉద్యోగులకు తెలియజేశారు. విశ్వవిద్యాలయం సాధించిన విజయాలు, తీసుకోని వచ్చిన మంచి సంస్కృతులు, విభాగంలో తీసుకోని వచ్చిన సంస్కరణలు, ముల్యాంకనం, పరీక్షల నిర్వహణ, ఫీజుల చెల్లింపు, ధ్రువపత్రాల పంపిణీలో తీసుకొచ్చిన మార్పులను వివరించారు. ఈ కార్యక్రమంలో సెల్ట్ సంచాలకులు డాక్టర్ ఆర్.మేఘనా రావు, డాక్టర్ కోలా శంకర్ పాల్గొన్నారు.

## కిశోర బాలికలకు స్నేహ హస్తం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** శాంతి మండల సమైక్య సమావేశం మందిరంలో కిశోర బాలికలతో స్నేహ బాలిక సంఘాల ఏర్పాటుకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏవో డ్వాక్రా సుజాత హాజరయ్యారు. యునిస్ఫ్ వారి దిశానిర్దేశంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సౌజన్యంతో వరంగల్ జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్ గా స్నేహ సంఘాల ఏర్పాటు చేసి కిశోర బాలికల హక్కులు సాధించుకోవడానికి విద్యాపరంగా ఉన్నత అవకాశాలు అందుకోవడానికి, భద్రత విషయంలో ఆరోగ్యం, పోషకాహార విషయంలో సమ వయస్కుల బృందంలో చర్చించుకునేలా ఏర్పాటు చేసిన వేదికనే స్నేహ కిశోర బాలికల సంఘాలు. ఈ సంఘాలలో 14 నుంచి 18 సంవత్సరాల బాలికలను ఐదు నుంచి 20 మందితో ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఈ సంఘం నెలకు రెండు నుంచి మూడు సమావేశాలు నిర్వహించుకుంటారు. ఈ సమావేశాలపై తల్లిదండ్రులతో గ్రామ పెద్దలతో చర్చించడం జరుగుతుందని సుజాత తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం కిషన్, ఎమ్మెస్ అధ్యక్షురాలు కర్నే కళ్యాణి, కార్యదర్శి రాజమణి, సీసీలు సురేశ్, కుమారస్వామి, ఏలియా, రాజయ్య, కృష్ణమూర్తి, ఎమ్మెస్ సిబ్బంది సుజాత, కృష్ణ, కృష్ణవేణి, మంజుల, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

# అడ్వైజరీ కమిటీని నియమించాలి

## సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డులో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను టెండర్ ద్వారా ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించాలనే ప్రతిపాదనను విరమించుకోవాలని, వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించి నిధులు దుర్వినియోగం కాకుండా కార్మికుల సంక్షేమం కోసమే ఖర్చు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ డిమాండ్ చేశారు. యునైటెడ్ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం ఆర్ట్స్ కాలేజీ ఆడిటోరియం నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకు భవన నిర్మాణ కార్మికులు ర్యాలీ నిర్వహించారు. నిర్మాణ కార్మికుల ఐక్యత వర్ధిల్లాలని, సీఐటీయూయు జిందాబాద్, అడ్వైజరి కమిటీని ఏర్పాటు చేయాలని, ఇన్సూరెన్స్ కంపెనీలను టెండర్లకు పిలవరాదంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట గంటపాటు నినాదాలు చేస్తూ ధర్నా చేశారు. ఈ ధర్నా కార్యక్రమానికి హాజరైన సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సుమారు 25 లక్షల మంది భవన, ఇతర నిర్మాణ కార్మికులు 54 వృత్తుల్లో పనులు చేస్తున్నారని, వీరంతా సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన అట్టడుగు వర్గాలకు చెందిన పేదలని, తెలంగాణ రాష్ట్రంలో 2007లో వెల్ఫేర్ బోర్డును ప్రకటించి 2009 నుంచి భవన నిర్మాణ కార్మికులకు 11రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, వీరికి చెందిన సంక్షేమ పథకాల అమలు బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించాలనే ప్రయత్నం చేస్తూ టెండర్లకు ఆహ్వానిస్తున్నారని, ఆ ప్రతిపాదనలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని రాగుల రమేష్ డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 25 లక్షల మంది పేర్లు నమోదు చేసుకుంటే 15 లక్షల మందిని మాత్రమే రెన్యువల్ చేయడం ద్వారా మిగతా పది లక్షల మంది సంక్షేమ పథకాలకు దూరం చేయడమే ప్రభుత్వ ఉద్దేశంగా కనబడుతుందని విమర్శించారు. ఈ ధర్నా కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బానోత్ వెంకన్న, ఆఫీస్ బేరర్స్ పుల్ల అశోక్, ఆలకుంట యాకయ్య, కూస రాజేష్, లింగమూర్తి, ఆలకుంట మల్లయ్య, వల్లెపు రాజు, సుధాకర్, రాసమల్ల వెంకటేష్, ప్రభాకర్, సూర్యనారాయణ, ఆర్.వెంకటేశ్, బొమ్మగాని వనజ, ఉడుత శ్రీవాణి పాల్గొన్నారు.

# బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కుతోనే కవితకు బెయిల్



**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి :** బీఆర్ఎస్ కేంద్రంలోని బీజేపీ పెద్దలతో కుమ్మక్కు కావడం వల్లే ఢిల్లీ లిక్కర్ కేసులో తిహార్ జైల్లో ఉన్న ఎమ్మెల్సీ కవితకు బెయిల్ లభించిందని మాజీ వరంగల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్, ఎన్ఎస్ యూఐ మాజీ జిల్లా అధ్యక్షుడు వీసం సురేందర్ రెడ్డి ఆరోపించారు. ఈ సందర్భంగా మంగళవారం వీసం సురేందర్ రెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు కలిసి బీజేపీ పెద్దలతో కుమ్మక్కయ్యారని, దీంతో 163 రోజుల పాటు తీహార్ జైల్లో ఉన్న కవితకు బెయిల్ మంజూరు అయిందని మండిపడ్డారు. తరచూ కేటీఆర్, హరీష్ రావు ఢిల్లీ వెళ్తూ ప్రధానమంత్రి మోడీ హోం శాఖ మంత్రి అమిత్ షా, బీజేపీ పెద్దలను కలుస్తూ కాళ్ల వేళ్లపై పడ్డారని ఆరోపించారు. బీఆర్ఎస్ ను బీజేపీకి తాకట్టు పెట్టారని, ఈ విషయం ప్రజలందరికీ అర్థమైందని పేర్కొన్నారు. మొన్నటి వరకు బీజేపీ-బీఆర్ఎస్ చీకటి ఒప్పందాలతో కాంగ్రెస్ ను దెబ్బతీయాలని చూశారని ధ్వజమెత్తారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీన ప్రక్రియ మొదలవుతుందనీ, ఇంకా బీజేపీలో బీఆర్ఎస్ విలీనం ఒక్కటే మిగిలిందని పేర్కొన్నారు. ప్రజలు వీటన్నింటిని గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని, ఆ రెండు పార్టీల వలలో చిక్కుకోవద్దని వీసం సురేందర్ రెడ్డి సూచించారు.

# మానుకోట డీఈఓగా రాజేశ్వర్



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** మానుకోట డీఈఓగా (ఎఫ్ఏసీ) వడెల రాజేశ్వర్ నియమితులయ్యారు. ఈ మేరకు విద్యాశాఖ రాష్ట్ర డైరెక్టర్ లింగయ్య ఉత్తర్వులు వెలువరించారు. రాజేశ్వర్ మానుకోట జిల్లా విద్యాశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్ గా విధులు నిర్వహిస్తున్నారు. కాగా, ప్రస్తుతం డీఈఓగా భాద్యతలు నిర్వహిస్తున్న రామారావుపై పలు అవినీతి, బాధ్యత రాహిత్యం, అక్రమ డిప్యూటేషన్లు, ప్రైవేట్ స్కూల్స్ లో పుస్తకాలు అమ్ముతున్న చర్యలు తీసుకోకపోవటం, గత నెల జరిగిన ప్రమోషన్స్, బదిలీలు రిక్రూట్ మెంట్ తేదీలు, డీఎస్ఈలు, ర్యాంకులు, మహిళల రోస్టర్ పాయింట్స్ మార్చటం, నియంత వ్యవహారం, అగౌరవంగా వ్యవహరించటం లాంటి ఫిర్యాదులతో పాటు టీఎస్ యూటీఫ్ ఉపాధ్యాయ సంఘాలు, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల నాయకుల ధర్నాల మేరకు స్పందించిన రాష్ట్ర విద్యాశాఖాధికారులు ఆయనపై బదిలీ వేటు వేశారు. ప్రభుత్వ చర్యకు యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మురళికృష్ణ, యాకూబ్ హర్షం వ్యక్తం చేశారు.

# రోడ్డు ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు




**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిలోని రఘునాథపల్లి మండలం నిడిగొండ-కోమల్ల-గోవర్ధనగిరి గ్రామాల్లో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడంతో అనేకమంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోతున్నారు. దీంతో రోడ్డు ఎక్కాలంటేనే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలోనే రఘునాథపల్లి పోలీసులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. ఈ తరుణంలో మంగళవారం నిడిగొండ గ్రామం వద్ద బారికెడ్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని, అందులో భాగంగానే ఇటీవల చిన్న పెండ్యాల-నిడిగొండ గ్రామాల వద్ద ప్రమాదాలు తరుచుగా జరగడంతో వాటిపై దృష్టి కేంద్రీకరించి బారికెడ్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. త్వరలో మరిన్ని భద్రత ఏర్పాట్లు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రఘునాథపల్లి సబ్ ఇన్ స్పెక్టర్ నరేష్ యాదవ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హైడ్రాను జిల్లాల్లో కొనసాగించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లాల్లో హైడ్రా కొనసాగించాలని ఎన్‌హెచ్ఆర్సీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్ సంధ్యారాణిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సునీల్‌కుమార్ చంద్రగిరి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయానికి పూర్తి మద్దతు తెలుపుతూ, ఎన్‌హెచ్ఆర్సీ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు వరంగల్ జిల్లాలో హైడ్రా రావాలని, హైడ్రాకు మద్దతుగా, జిల్లా కలెక్టర్ భవనంలో కలెక్టర్‌ను కలిసి సంస్థ గురించి వివరించి, వరంగల్ జిల్లాలో జరిగే అవినీతి కబ్జాకోరుల మీద, అక్రమ నిర్మాణాలపై ఉక్కు పాదం మోపాలని కోరారు. అలాగే, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లి, వరంగల్ జిల్లా సమస్యలను తీర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్ఆర్సీ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్ కుమార్, ఎన్‌హెచ్ఆర్సీ నాయకులు పాల్గొన్నారు.

# ద్రంకెన్ డ్రైవ్ కేసులో 33 మందికి జరిమాన

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో లైసెన్స్ లేకుండా వాహనం నడిపి పట్టుబడ్డ 13 మంది వాహనదారులకు వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి రూ.18600 జరిమాన విధించారు. డ్రంకెన్ డ్రైవ్ కేసులో 33మందికి రూ.34,600 జరిమాన విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కె.రామకృష్ణ తెలిపారు.

# గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయుల డిప్యూటేషన్ రద్దు చేయాలి

## ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీరా వెంకట్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జనగాం, హనుమకొండ జిల్లాలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల, బాలుర పాఠశాలలో, గిరిజన హాస్టళ్లలో ఉపాధ్యాయులు, వార్డెన్ల అక్రమ డిప్యూటేషన్ రద్దు చేయాలని గిరిజన సంక్షేమ అభివృద్ధి శాఖ కార్యాలయంలోని జిల్లా అధికారి డీటీడీఓకు విద్యార్థి, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎల్ హెచ్ పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీరా వెంకట్ మాట్లాడుతూ ఏకపక్షంగా తమ ఇష్టానుసారంగా నిబంధనలను ఉల్లంఘిస్తూ రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా ఉపాధ్యాయల, వార్డెన్ల సర్దుబాట్ల పేర్లతో స్టేషన్ ఘనపూర్ నుంచి ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో సాధారణ బదిలీల్లో భాగంగా వచ్చిన ఉపాధ్యాయులను జనగాం జిల్లా పసరమండ్ల, హనుమకొండ జిల్లా బాలసముద్రం ఆశ్రమ బాలుర పాఠశాలకు డిప్యూటేషన్ పై ఉపాధ్యాయులను పంపారని, పంపించిన ఉపాధ్యాయుల డిప్యూటేషన్ రద్దు చేసి, తిరిగి స్టేషన్ ఘనపూర్ ఆశ్రమ బాలికల పాఠశాలలో పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సాధారణ బదిలీల్లో భాగంగా స్టేషన్ ఘనపూర్ బాలికల ఆశ్రమ పాఠశాలకు బదిలీ అయిన ఉపాధ్యాయులను అక్కడి నుంచి అక్రమంగా బాలసముద్రం గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలో డిప్యూటేషన్ పై వార్డెన్ పోస్ట్ ఇచ్చారని, బాలుర పాఠశాలలో మహిళకు వార్డెన్ పోస్ట్ ఎలా ఇస్తారని జిల్లా అధికారి డీటీడీఓను ప్రశ్నించామని తెలిపారు. అదే విధంగా బదిలీపై ఘనపూర్ కు వచ్చిన ఉపాధ్యాయుని జనగామలోని గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలో అడ్మిషన్ అయిన విద్యార్థుల దగ్గర నుంచి, టీసీ తీసుకెళ్లిన విద్యార్థుల దగ్గర నుంచి పైసలు వసూలు చేసిన ఉపాధ్యాయుడికే మళ్లీ డిప్యూటేషన్ పై ఎలాంటి ఉత్తర్వులు లేకుండానే ప్రధానోపాధ్యాయుడి పోస్ట్ కట్టబెట్టడం దారుణమన్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఉపాధ్యాయులు సాధారణ బదిలీలు అయిన పాఠశాలలో, హాస్టల్లో ఉపాధ్యాయులు, వార్డెన్లను ఉంచకుండా డిప్యూటేషన్ పై ఇతర పాఠశాలకు, హాస్టళ్లకు డిప్యూటేషన్ పై బదిలీ చేస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయులు, వార్డెన్ల డిప్యూటేషన్ రద్దు చేసి, వారు సాదారణ బదిలీ అయిన చోట వెనక్కి పంపించాలని డిమాండ్ చేశారు. సాధారణ బదిలీ అయిన చోట నుండి మరో చోటకు ఎందుకు పంపిస్తున్నారని గిరిజన జిల్లా అధికారికి అడిగితే నా చేతిలో ఏమీ లేదు మొత్తం భద్రాచలం పీఓనే డిప్యూటేషన్ ఆర్డర్ ఇస్తున్నారని నాకేం సంబంధం లేనట్లుగా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఘనపూర్ బీఆర్ఎస్వీ నియోజకవర్గ ఇంచార్జి లకావత్ చిరంజీవి, కాకతీయ విశ్వవిద్యాలయం స్కాలర్ అసోసియేషన్ అధ్యక్షుడు భూక్య హుస్సేన్ నాయక్, గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోతు భాస్కర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# బందోబస్తు కానిస్టేబుల్‌కు పాము కాటు

## గవర్నర్ ములుగు పర్యటనలో అపశృతి




**వరంగల్ వాయిస్, ములుగు :** తెలంగాణ రాష్ట్ర గవర్నర్ పర్యటనలో భాగంగా వెంకటాపూర్ మండలంలోని దట్టమైన అడవిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా భారీ బందోబస్తులో ఉన్న గ్రేహౌండ్ పోలీస్ కానిస్టేబుల్ గుండ్ల ప్రశాంత్ అనే వ్యక్తికి విష పురుగు కాటు వేయడంతో అపస్మారక స్థితికి వెళ్లాడు. గమనించిన తోటి కానిస్టేబుళ్లు ఉన్నతాధికారుల సమాచారం అందించి హుటాహుటిన వెంకటాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ రిషిత సుమారు గంట పాటు శ్రమించి వైద్య సేవలను అందించి కానిస్టేబుల్ ప్రశాంత్ ఆరోగ్య పరిస్థితి నిలకడకు వచ్చేవరకు చికిత్స అందించి తను మాట్లాడి నడిచిన తర్వాత స్థానిక అంబులెన్స్ లో ములుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు, మరికొంత మెరుగైన వైద్యం అందించారు. ప్రస్తుతం ప్రశాంత్ ఆరోగ్య పరిస్థితిపై వెంకటాపూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్, ములుగు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులను ఫోన్ లో సంప్రదించగా ప్రస్తుతానికి ఆయన ఆరోగ్యం నిలకడగా ఉంది ఆసుపత్రిలోనే చికిత్స పొందుతున్నట్లు అక్కడి వైద్యులు తెలిపారు.



# నా జర్నీ ఇప్పుడే మొదలైంది

## మిస్టర్ బచ్చన్ బ్యూటీ భాగ్యశ్రీ భోర్సే



కొన్ని రోజులుగా నెట్టింట మార్మోగుతున్న పేరు భాగ్య శ్రీ బోర్సే . ఇటీవలే మాస్ రవితేజ-హరీష్ శంకర్‌కాంబినేషన్‌లో వచ్చిన 'మిస్టర్ బచ్చన్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హాయ్ చెప్పింది. సినిమా విడుదల కాకముందే ఏదో ఒక స్టిల్‌తో నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం ఊహించని డిజాస్టర్ టాక్ తెచ్చుకుంది. సినిమా హిట్టా.. ఫట్టా అనేది పక్కన పెడితే.. తెలుగులో ఇది మొదటి సినిమా కాబట్టి నటిగా తన ఫీలింగ్‌ను అందరితో షేర్ చేసింది. మీ అమ్మాయిపై మీరంతా చూపిస్తున్న ప్రేమ ఊహించలేనిది. నా ప్రయాణం కేవలం ఇప్పుడే మొదలైంది. నా నెక్స్ట్ చాప్టర్‌ను మీతో పంచుకునేందుకు వేచి ఉండలేకపోతున్నా.. అంటూ సోషల్ మీడియాలో రాసుకొచ్చింది భాగ్య శ్రీ బోర్సే. మొత్తానికి భాగ్య శ్రీ బోర్సే సక్సెస్‌ఫుల్‌గా జర్నీ సాగించాలంటే హిట్టు, ఫ్లాపులను ఒకేలా స్వీకరించాలంటూ చెప్పకనే చెబుతోంది. ఈ భామ ప్రస్తుతం విజయ్ దేవరకొండ హీరోగా గౌతమ్ తిన్ననూరి డైరెక్ట్ చేస్తున్న వీడీ 12 చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తోంది. దుల్కర్ సల్మాన్ నటిస్తోన్న చిత్రంలో కూడా ఫీ మేల్ లీడ్ రోల్‌లో కనిపించబోతున్నట్టు వార్తలు వస్తుండగా.. వీటిపై క్లారిటీ రావాల్సి ఉంది.

## మీడియా అతిగా చేస్తోంది..



నటులు, దర్శకుల నుంచి మలయాళ చిత్ర పరిశ్రమలోని మహిళలు లైంగిక వేధింపులు ఎదుర్కొన్నారని హేమ కమిటీ నివేదిక ఇచ్చిన నేపథ్యంలో వస్తున్న ఆరోపణలపై కేంద్రమంత్రి సురేశ్ గోపీ స్పందించారు. ఈ అంశంపై మీడియా చేస్తున్న ప్రచారంపైనా ఆయన మండిపడ్డారు. చిత్ర పరిశ్రమపై ప్రజల అభిప్రాయాన్ని తప్పుదోవ పట్టించేలా ప్రవర్తిస్తోందంటూ మీడియా తీరుపై మండిపడ్డారు. చిత్రసీమలో వస్తున్న లైంగిక ఆరోపణలు గురించి మీడియా చేస్తున్న ప్రచారం ప్రజల అభిప్రాయాన్ని తప్పుదోవ పట్టిస్తోంది. ఈ ఆరోపణలే మీడియాకు ఆహారం పెడుతున్నాయి. మీరు డబ్బు సంపాదించేందుకు వీటిని ఉపయోగించుకుంటున్నారని అర్థమవుతోంది. అయితే.. వాస్తవాలు ఏంటో తెలియకుండా ప్రజలను తప్పుదోవ పట్టించడం సరికాదని సురేశ్ గోపీ మీడియా అడిగిన ప్రశ్నకు ఈ విధంగా స్పందించారు. మీ స్వలాభాల కోసం అలజడి సృష్టించేందుకు ప్రయత్నించడమే కాకుండా.. వారి అభిప్రాయాలను తప్పుదోవ పట్టిస్తున్నారు. మీరు న్యాయస్థానం కంటే గొప్పకాదు. ఈ సమస్య కోర్టు పరిధిలో ఉంది. నిజానిజాలు తెలుస్తాయి. అంతవరకు వేచి ఉండండి. న్యాయస్థానాన్ని ఓ నిర్ణయం తీసుకోనివ్వండని పేర్కొన్నారు.ప్రముఖ దర్శకుడు, కేరళ స్టేట్ చలచిత్ర అకాడమీ అధ్యక్షుడు రంజిత్ బాలకృష్ణన్ తనతో అసభ్యకరంగా ప్రవర్తించారని బెంగాలీ నటి శ్రీలేఖ కూడా ఆరోపించడం సంచలనం రేపుతోంది. దీనిపై మీడియాలో వస్తున్న కథనాలపై తాజాగా స్పందించిన కేంద్రమంత్రి సురేశ్ గోపీ ఈ వ్యాఖ్యలు చేశారు.

# ప్రత్యేక సాంగ్ ఆఫర్

## వెడ్డింగ్ ఫిక్స్‌తో .. అంగీకరిస్తుందా .. అన్న చర్చ



కొద్ది రోజుల్లో బాలీవుడ్ బ్యూటీ, తెలుగు సోయగం శోభిత దూళిపాళ్ల అక్కినేని వారి ఇంట అడుగుపెట్టబోతున్నది.ఇప్పటికే ఎంగేజ్‌మెంట్ పూర్తి చేసుకున్న నాగ చైతన్య, శోభిత జంట మరో రెండు మూడు నెలల్లో డెస్టినేషన్ వెడ్డింగ్‌తో పెళ్లి పీటలు ఎక్కనున్నారు. ఈ క్రమంలో ప్రస్తుతం తమ సినిమా షూటింగ్‌లను కానిచ్చేస్తున్నారు. నాగ చైతన్య తండేల్ సినిమా షూటింగ్ బిజీలో ఉండగా శోభిత సితార అనే ఓ హిందీ చిత్రంలో నటిస్తోంది. అయితే తాజాగా శోభితకు బాలీవుడ్ ప్రొడక్షన్ హౌజ్ నుంచి ఓ బంఫరాఫర్ వచ్చినట్లు తెలుస్తోంది. షారుఖ్‌ఖాన్, రణ్ వీర్ సింగ్ వంటి అగ్ర హీరోలు నటిస్తున్న డాన్3 సినిమాలో ఓ ప్రత్యేక పాట కోసం మూవీ మేకర్స్ శోభితను సంప్రదించినట్లు బాలీవుడ్ కోడై కూస్తోంది ఈ విషయమై ఇప్పటికే ఆమెతో చర్చలు కూడా ముగిసినట్లు తెలుస్తోంది. అయితే శోభిత ఇప్పటి వరకు తన సినీ కెరీర్‌లో ఒక్క ఐటెం సాంగ్ కూడా చేయలేదు. ఈమధ్యే నాగ చైతన్యతో పెళ్లికి సిద్ధమైన శోభిత మరి ఈ ఐటం సాంగ్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందా, ఇస్తుందా అనే విషయం తెలియాల్సి ఉంది. మరి కొద్ది రోజుల్లో అధికార ప్రకటన వచ్చే అవకాశం ఉంది.
ఇదిలాఉండగా గతంలో నాగ చైతన్య, సమంత పెళ్లి తరువాత అక్కినేని ఫ్యామిలీ ఆమె కెరీర్ విషయంలో ఫుల్ ఫ్రీడమ్ ఇవ్వగా నాగ చైతన్య సమంతను బాగా ప్రోత్సహించాడు. ఆ క్రమంలో సమంత ఒకటి రెండు బోల్డ్ రోల్స్ చేసింది. దీంతో అవే వారి మధ్య విభేదాలకు కారణమనే ప్రచారం కూడా నడిచింది. ముఖ్యంగా ఫ్యామిలీ మ్యాన్ వెబ్ సిరీస్ వారి విడాకులకు ప్రధాన కారణమన్న వార్తలు కూడా అప్పట్లో బాగా హల్‌చల్ చేశాయి. అదే నిజమన్నట్లుగా చైతన్యతో కలిసి విడాకుల ప్రకటన జరిగిన నెలలోపే పుష్ప సినిమాలో సమంత గాటు ఐటెం సాంగ్ కూడా చేసింది.
అదంతా ఇప్పుడు గతం అనుకుంటే కొద్దిరోజుల క్రితమే నాగచైతన్య ,శోభిత ల ఎంగేజ్మెంట్ జరగగా రాజస్థాన్‌లో డెస్టినేషన్ వెడ్డింగ్ కు ప్లానింగ్ జరుగుతున్నట్లుగా సమాచారం. మరి ఈ పెళ్లయ్యాక అక్కినేని ఫ్యామిలీ సమంతకు ఇచ్చినట్టుగానే శోభిత సినిమాల్లో నటించడానికి ఒప్పుకుంటారా అనేది వంద డాలర్ల ప్రశ్నలా ఉంది.




# ఈగ ఉంటే చాలంట

## నానితో దర్శకుడు రాజమౌళి సరదా కామెంట్

విజువల్ వండర్ అనే పదానికి టాలీవుడ్‌లో అసలైన అర్థం చెప్పిన చిత్రం 'ఈగ'.. పెద్ద హీరోలతోనే కాదు.. చిన్న ఈగతోనూ సినిమా తీసి బాక్సాఫీసు దగ్గర రికార్డులు సృష్టించొచ్చని నిరూపించారు దర్శకుడు రాజమౌళి. తాజాగా ఈ సినిమా సీక్వెల్ గురించి నాని ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. రాజమౌళికి తనకు మధ్య జరిగిన సరదా సంభాషణను పంచుకున్నారు. 'నేను విజయేంద్ర ప్రసాద్ సర్‌ని ఎప్పుడూ 'ఈగ' సీక్వెల్ గురించి అడగలేదు. కానీ, రాజమౌళితో దీని గురించి సరదాగా చర్చించాను. 'ఈగ 2' చేస్తానన్నారు కదా.. ఇది ఎప్పుడు మొదలుపెడదామని అడిగాను. అప్పుడు దానికి ఆయన.. 'మేము ఈగ 2' చేసినా నీతో అవసరం లేదు. ఈగ ఉంటే చాలు. అదే సీక్వెల్‌లో తిరిగి వస్తుంది' అని చెప్పారు. 'ఈగ' సినిమా చేయాలనే ఆలోచన రావడమే చాలా గొప్ప విషయం. రాజమౌళి ధైర్యానికి మెచ్చుకోవాల్సిందే. ఆయనకు దీని సీక్వెల్ గురించి ఆలోచన వచ్చినప్పుడు కచ్చితంగా ఆ పనులు ప్రారంభిస్తారని నేను అనుకుంటున్నా. అదే జరిగితే మరో అద్భుతమైన చిత్రంతో ప్రపంచాన్ని ఆకర్షిస్తారు' అంటూ దర్శకధీరుడిపై ప్రశంసలు కురిపించారు. నాని, సమంత ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన 'ఈగ' బాక్సాఫీసు వద్ద ఘన విజయం అందుకుంది. సుదీప్ విలనిజం ఎంతగానో ఆకట్టుకుంది. 2012లో విడుదలైన ఈ సినిమా 2 జాతీయ అవార్డులు, 3 సైమా అవార్డులు, 5 సౌత్ ఫిల్మ్‌ఫేర్ అవార్డులు సాధించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం నాని 'సరిపోదా శనివారం' అంటూ సందడి చేసేందుకు సిద్ధమయ్యారు. వివేక్ ఆత్రేయ కాంబినేషన్‌లో తెరకెక్కిన ఈ చిత్రం ఈ నెల 29న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# ఆదివాసీల అభ్యున్నతికి చిత్తశుద్ధితో కృషి చేయాలి

**వారు అన్ని రంగాల్లో రాణించాలి**

**ఆర్థిక అభివృద్ధి సాధించాలి**

**విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి**

**రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ**







**వరంగల్ వాయిస్, ములుగు :** అడవిని నమ్ముకుని జీవించే నిర్మలమైన మనసు గల ఆదివాసీలు, గిరిజనుల అభ్యున్నతికి అధికారులు చిత్త శుద్ధితో కృషి చేయాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ సూచించారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా గవర్నర్ మంగళవారం ములుగు జిల్లాకు చేరుకున్నారు. రోడ్ మార్గంలో ములుగు జిల్లా ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ కు చేరుకున్న గవర్నర్ కు రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్ రావు, జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర, ఎస్పీ డాక్టర్ పి.శబరీష్, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) శ్రీజ, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మహేందర్ జీ తదితరులు పూల మొక్కలు అందజేసి సాదర స్వాగతం పలికారు. సంప్రదాయ నృత్య ప్రదర్శనలతో మహిళలు, చిన్నారులు వెంటరాగా గవర్నర్ ముందుకు సాగారు. అనంతరం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా భేటీ ఆయ్యారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, డీఎఫ్ఓలు ములుగు జిల్లా సమగ్ర అభివృద్ధికి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. గవర్నర్ జిల్లా అభివృద్ధిపై ఆసక్తి చూపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తాను గవర్నర్ గా బాధ్యతలు స్వీకరించిన తొలిపర్యటనగా షెడ్యూల్ ప్రాంతమైన ములుగు జిల్లాను ఎంచుకొని రావడం జరిగిందని పేర్కొన్నారు. తాను కూడా గతంలో పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్మెంట్ మంత్రిగా పని చేసిన అనుభవం ఉందన్నారు. ప్రభుత్వ పథకాలు బాగున్నాయని ప్రశంసించారు. పేదలు, గిరిజనులు, ఆదివాసుల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని పేర్కొన్నారు. ముఖ్యంగా విద్య ఆరోగ్య రంగాల్లో అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నదని తెలిపారు. ఇదే స్ఫూర్తి నిరంతరం కొనసాగాలని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలతో గిరిజనులు, ఆదివాసులు అన్ని రంగాల్లో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ స్ఫూర్తి కొనసాగాలని కోరారు. ఆధునిక సమాజంలో ఆదివాసులు గిరిజనులను భాగస్వాములు చేసేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. వీరికి అన్ని రకాలుగా మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. వీరి కోసం జిల్లాలో కంటైనర్ హాస్పిటల్ వినూత్నంగా ఏర్పాటు చేయడం పట్ల మంత్రి సీతక్కను ప్రత్యేకంగా అభినందించారు. ఆదివాసీ, గిరిజన గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని, మీరంతా అత్యుత్తమంగా విద్యను అభ్యసించి నవ సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. గిరిజనులు, ఆదివాసులు ఆధునిక సమాజానికి అనుగుణంగా ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలతో అన్ని రంగాల్లో ఆర్థికంగా పైకి రావాలని సూచించారు. ఇతర వర్గాలకు ఆదర్శంగా నిలువాలని ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు.

### ప్రముఖులతో సమావేశం..

అనంతరం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో రాష్ట్ర గవర్నర్ జిల్లాకు చెందిన రచయితలు, కవులు, కళాకారులు, జాతీయ, అంతర్జాతీయ క్రీడా అవార్డు గ్రహీతలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులలు ప్రొఫెసర్ పాండురంగారావు, ఇన్ టాక్, రచయిత డాక్టర్ రాచర్ల గణపతి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అంబటి శ్రీజన్, రెజ్లింగ్ క్రీడాకారిని చల్ల మౌనిక, జిమ్నాస్టిక్ క్రీడాకారిని పి రజిత, వాలీబాల్ గోల్డ్ మెడలిస్ట్ పాలడుగు వెంకటేశ్వరరావు, ఎన్విరాన్మెంట్ సైంటిస్ట్ కాజంపురం దామోదర్, సోషల్ వర్కర్ కొమరం ప్రభాకర్, నేషనల్ అంబేద్కర్ ఫెలోషిప్ అవార్డు గ్రహీత, మ్యాథమెటిక్స్ టీచర్ డాక్టర్ కొండల రామయ్య తదితరులతో సమావేశం నిర్వహించారు. జిల్లాకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రాఖ్యతులు తీసుకురావడంపై వారిని అభినందించారు. ప్రొఫెసర్ పాండు రంగా రావు రామప్ప దేవాలయం, నిర్మాణం, సాండ్ బాక్స్ టెక్నాలజీ, ఆలయ విశిష్టత వివరించారు.

### రామప్పలో పూజలు..

ములుగు జిల్లా పర్యటనలో భాగంగా ములుగు చేరుకున్న గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ రామప్ప దేవాలయాన్ని సందర్శించారు. రామప్ప ఆలయ ప్రాంగణంలో పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం దేవాలయ వేద పండితులు సంప్రదాయ వాయిద్యాల నడుమ పూర్ణకుంభంతో గవర్నర్ కు ఘన స్వాగతం పలికారు. రుద్రేశ్వరుడిని దర్శించుకున్న గవర్నర్ ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు గవర్నర్ ను పట్టు వస్త్రాలతో సత్కరించి, ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏటూరు నాగారం పీఓ చిత్ర మిశ్రా, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, ఆర్డీఓ సత్య పాల్ రెడ్డి సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క గవర్నర్, ప్రిన్సిపాల్ సెక్రటరీలను శాలువాతో సత్కరించారు. ఆదివాసీ చిత్రాలకు సంబంధించిన జ్ఞాపకాలను వారికి బహుకరించారు.



# నాట్య మయూరి అలకనంద రాథోడ్

**మథర్ థెరిస్సా జయంతి వేడుకల్లో అవార్డు ప్రదానం**

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ఆంధ్రప్రదేశ్ ఎక్స్-రే సాంస్కృతిక శాఖ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సోమవారం విజయవాడ హనుమంతరాయ గ్రంథాలయంలో జరిగిన మథర్ థెరిసా జన్మదిన వేడుకల్లో తన నృత్య ప్రదర్శనతో అందరిని ఆకట్టుకున్న అలకనంద రాథోడ్ కు నాట్య మయూరి అవార్డు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన విజయవాడ డిప్యూటీ కలెక్టర్ కొమ్మెర్ల క్రిష్ణ వేణి, మాజీ మంతి నన్నపనేని రాజకుమారి, విజయవాడ జడ్పీ చైర్మన్ గద్దె అనురాధ చేతుల మీదుగా నృత్య కళాకారిణి బానోత్ అలకనంద నాట్య మయూరి అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భారత దేశానికి పుట్టినిల్లుగా పిలవబడే భరత నాట్యం ఎంతో ప్రాముఖ్యమైనదన్నారు. చిన్నవయసులో అలకనందకు భరత నాట్యం పట్ల ఉన్నటువంటి శ్రద్ద, భక్తి, ఎంతో విలువైనదని, అలాంటి నృత్యాన్ని ప్రదర్శన ఇస్తుంటే సాక్షాత్తు అమ్మవార్లే దిగివచ్చినట్లు ఉందని పలువురు ప్రశంసించారు. భవిష్యత్ లో మరెన్నో జాతీయ, అంతర్జాతీయ వేడుకల్లో పాల్గొని అవార్డులు, రివార్డులు అందుకోవాలని కుమారి అలకనంద రాథోడ్ ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎక్స్-రే సాంస్కృతిక శాఖ అధ్యక్షులు కొల్లూరి, సంస్థ నిర్వాహకులు, తల్లిదండ్రులు, మథర్ థెరిసా అవార్డు గ్రహీతలు పాల్గొన్నారు.

# మనకూ కావాలి వాడ్రా



**వరంగల్ వాయిస్, వరంగల్ :** హైదరాబాద్ లో చెరువు శిఖాలు, నాలాలు ఆక్రమించి కట్టిన నిర్మాణాలపై ఉక్కుపాదం మోపుతున్న హైడ్రా మాదిరిగానే వరంగల్ లో కూడా వాడ్రాను అమలు చేయాలని ప్రముఖ సామాజిక కార్యకర్త నిమ్మల శ్రీనివాస్ కోరారు. 'ఫోరమ్ ఫర్ బెటర్ వరంగల్'ఆధ్వర్యంలో మంగళవారం నగరంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆక్రమణపై ఆందోళన వ్యక్తం చేశారు. వాటిని తొలగించి నగరాన్ని పరిరక్షించాలని కోరారు.

# కొద్దిగా ఆలస్యం జరిగినా..

# నిజం, న్యాయమే గెలిచింది

**మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్**



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సర్వోన్నత న్యాయస్థానం బెయిలు మంజూరు చేయడంపై మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ హర్షం వ్యక్తం చేశారు. కొద్దిగా ఆలస్యం జరిగినా.. నిజం, న్యాయమే గెలిచిందన్నారు. నరేందర్ ఆధ్వర్యంలో బాంబులు కాల్చి, స్వీట్లు పంచి ఘనంగా సంబరాలు చేశారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడతూ ఏ ఆధారాలు చూపకుండా లిక్కర్ కేసులో 166 రోజులు కవిత మీద అక్రమ కేసులు పెట్టి జైల్లో ఉంచడం జరిగిందన్నారు. ఇన్ని రోజులు అక్రమ కేసులు పెట్టి ఉంచిన తరువాత ఈ రోజు భారతదేశ అత్యున్నత న్యాయస్థానంలో నిజం గెలిచి బెయిల్ మంజూరు అవడం జరిగిందన్నారు. అంతే కాకుండా ఈ రోజు కడిగిన ముత్యంలా కవిత బయటికి రావడమే కాకుండా రానున్న రోజుల్లో కూడా నిజం, న్యాయం గెలిచి ఈ యుద్ధంలో విజయం సాధిస్తుందన్నారు. కోర్ట్ ల మీద అవగాహన లేని బండి సంజయ్ సుప్రీం కోర్ట్ తీర్పును తప్పుపట్టడం సిగ్గు చెటు, అంతేకాకుండా బీజేపీ ప్రభుత్వం కేసీఆర్ ను ఎదురుకునే దమ్ము లేక వారి కుటుంబ సభ్యుల మీద ఇలా అక్రమ కేసులు పెట్టడం సబబు కాదన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దిడ్డి కుమారస్వామి, మరుపల్ల రవి, మాజీ మార్కెట్ చైర్మన్ టి.రమేష్ బాబు, మాజీ కార్పొరేటర్ కుందారపు రాజేందర్, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com